# కాస్ట్లీ



అనంత

"అబ్బో! ఇది చాలా ఖరీదులెండి!
"ఎంతంటారు?"
"నాకు సరిగ్గా తెలియదుగానీ చాలా ఖరీదట"
"ఆహాఁ! ఎవరు చెప్పారు మీతో అలా అని?"
"ఇంకెవరు అయినా ఎవరో చెబితే నేనెందుకు నమ్ముతాను? సాక్షాత్తూ మావారే మొన్న బొంబాయి వెళ్ళినప్పుడు తెచ్చారు"

బొంబాయి నుంచి తెచ్చారా? ఇట్లాంటివి ఇక్కడ కూడా దొరుకుతున్నాయిగా? అయినా వాయిల్ చీరలు అక్కడచౌకకదూ అందుకు తెచ్చారేమోలెండి"

"భలేవారే మీరు. అంతమాత్రం తెలియదండీ? ఇక్కడ దొరికేవి చౌకరకం. అక్కడ చాలా మంచివి. ఖరీదైనవి ఉంటాయి. కాస్ట్లీ కాకపోతే మావారు నాకోసం తీసుకునేరారు.

"అవునవును మీ వన్నీ

కాస్టీనే కదూ." కాస్ట్లీ యూనిఫారం వేసుకున్న డ్రైవరు వచ్చి విష్ చేయడంతో వస్తానే రేపు సాయంకాలం కలుద్దాం అంటూ వానిటీ బాగ్‌ని భారీశరీరాన్నీ ఊపుకుంటూ నిష్క్రమించారు రంగనాయకమ్మగారు.

హమ్మయ్యా ! కాస్ట్లీ వాతావరణంలో ఉక్కిరి బిక్కిరైన మనకి మామూలు గాలిపీల్చుకునే వీలు దొరికింది. అంటూ గట్టిగా గాలిపీల్చివదిలింది. ఇందాకటినుంచి రంగనాయకమ్మ గారి ఖరీదైన వాయిల్‌చీర ధర గురించి చర్చించిన సరళ.

అప్పటిదాకా మహిళామండలి సభ్యులు తయారుచేసిన వస్తువులు పరిశీలిస్తూ ఉండిపోయిన గీత 'ఏమిటి సరళా ఆరంగమ్మగారితో నీ వాదన? మహిళామడలి అంటే చీరల గురించి నగల గురించిచర్చించే చోటని చాలా మందికి ఉన్న అభిప్రాయం రుజువు చేస్తున్నారు మీరు. రా!రా! నా పనిలో సాయంచెయ్యి!" అంది.

సరళ హఠాత్తుగా లేచి జరగకూడని దేదో జరిగినట్టుగా తప్పు తప్పు అలా అనకూడదు. వీలయితే రంగనాయకమ్మ గారు బి.ఏ అనాలి కాని రంగమ్మ అనొచ్చా? కళ్ళు పోవూ? ఈ ఊళ్ళో నీకుపుట్టగతులుంటాయా?" అని గీతని కోప్పడింది.

చాల్లే నీ అభినయం. 'రంగి' రంగమ్మగా రంగనాయకమ్మగా మారటం ఈఊళ్ళో ఎవరికితెలియదు? ఎదురుగా రంగనాయకమ్మ గారు అన్నా వెనకాల అంతా 'రంగి' అనే అంటారు. నేను నయం రంగమ్మగారు అన్నా" అంది గీత.

"అన్నీ ఖరీదైనవి గా ఉండాలనే పిచ్చి ఉన్న రంగి తన పేరు కూడా రంగనాయకమ్మ అని ఉంటేకాస్ట్లీగా ఉంటుందనుకుందేమో. అలానే అనాలని పట్టుపడుతుంది. పాపం ఎవరి పిచ్చివారికానందం.

"నిజమే గాని ఈవిడ ఈ పిచ్చిలో వాళ్ళాయనకి నిజంగా పిచ్చెక్కిస్తోంది. మనమంతా ఏదైనా వస్తువుమంచిదైతే తీసుకుంటాం.కాని ఈవిడకి మంచిచెడులతో ప్రసక్తి లేదు. ఖరీదు ఎక్కువుంటే చాలు. పాపం! ఆ సుబ్బరామయ్యగారేంచేస్తారు చెప్పు. ప్రతి వస్తువూ కొనేప్పుడు ధర కొన్నిచోట్ల వాకబు చేసి ఆవిడకి చెప్పేప్పుడు రెట్టింపు చేసి చెబుతాడు. ఇంక ఆ అబద్ధం కప్పిపుచ్చటానికి ఎన్నిపాట్లో చూడు. పొరపాటున ఎప్పుడైనా నిజం రేటునోరు జారొచ్చు. ఏదైనా బిల్లు కర్మంకాలి ఆవిడ కంటపడవచ్చు. ఏతెలిసినవాళ్ళో ఈయనకొన్నప్పుడున్న వాళ్ళు మాటవరసకి ఆవిడతో చెప్పొచ్చు. దీంతో ఆయనకి ఎప్పుడు ఇదే ఆలోచన" అంది గీతజాలిగా.

. నిజమే పాపం! ఆయన్ని చూస్తే జాలేస్తోందే" అంటూ గీత మాటలను సపోర్ట్‌చేసింది సరళ.

'మొన్ననేం జరిగిందోతెలుసా! కొడుకు టెన్త్ పాస్ అయినప్పుడు ఒక కాస్ట్లీ పార్టీ ఇచ్చిందిగా. అందులో తీసిన కలర్‌ఫోటోల్లో ఒకటిబాగుంది. దాన్ని ఆల్బంలో కాకటి.వి. మీదపెడదాం మంచికాస్ట్లీ ఫోటోఫ్రేం తెమ్మందిట. ఆయనేదో మంచిదే తెచ్చి రేటు అడిగితే మూడొందలు అన్నారట. సంబరపడిపోయింది. ఎవరో నీలాంటి తల్లే వచ్చి దాని ఖరీదు ముప్పై రూపాయలకి పైన ఉండదు అని వాదిస్తే ఇద్దరూ పందెం వేసుకుని వాళ్ళకి దగ్గిరలో ఉన్న ఒక షాపుకి వెళ్ళి దాని ఖరీదు కన్‌ఫర్మ్ చేసుకున్నారట. ఇంక చూసుకో భర్తమీదఆవిడ తాండవం. ఆవిడకి ఏవేవో చెప్పి సముదాయించటానికి ఆయన తలప్రాణం తోకకి వచ్చినట్లైందట. ఆయన నిన్న మాఇంట్లో చెప్పి ఒకటే గోల. నిజంగా నాకు ఎంతోకోపం వచ్చింది.అందుకే ఇవాళ ఆవిడతో సరిగా మాట్లాడాలనిపించలేదు. గీత మాట్లాడడం ఆపింది. సరళకి కూడా ఇంకేం మాట్లాడాలనిపించలేదు. ఇద్దరూ ఎవరిపని వాళ్ళు చూసుకుంటున్నారు.

★★★

రంగనాయకమ్మగారూ! పదిరోజుల్నుంచి మీరు ఇటువైపు రావటం లేదేం? అడిగిందిసరళ.

"మా రవికి ఒంట్లో బాగుండలేదమ్మా! హాస్పిటల్‌లో చేర్చాం. అందుకని బిజీగా ఉన్నాను."

"ఇప్పుడు డిశ్చార్జ్ చేశారా?"

"ఆఁ! నిన్ననే ఇంటికి తెచ్చాం. అందుకే ఈ రోజు రాగలిగాను."

"ఇంతకీ ఏమిటీ అనారోగ్యం?"

"వాడు మొదటినుంచీ ఇంతే! కడుపులో పడ్డప్పటినుంచీ మందులూ, టానిక్కులూ, పళ్లరసాలు వీటిమీదే ఆధారం. ఇంక నేల మీద పడ్డప్పటినుంచీ సరేసరి! వాణ్ణి పెంచడం ఎంత కాస్ట్లీనో! అందుకే ఒక్కడు చాలనుకున్నాం. పువ్వుల్లో పెట్టి వాణ్ణి అంత అపురూపంగా పెంచుకుంటూ వస్తుంటే... ఇప్పుడు చూడు వాడికెలాంటి జబ్బు చేసిందో!" గొంతు కొంచెం వణకుతుంటే, ఆవిడ మాట్లాడడం ఆపేసింది.

"ఈ రోజుల్లో ఏ జబ్బయినా అంత భయపడాల్సిన పనిలేదండి రంగనాయకమ్మ



### మీటింగ్

మీటింగ్‌లో ఒకతను మైక్ పట్టుకుని గట్టిగా చెప్తున్నాడు. "మనది భారతదేశం మనమంతా భరతమాత బిడ్డలం మనమందరమూ ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఉండవలెను..." ఇంకా ఏవో అంటుండగా కిందనుండి అందరూ లేచి

"ఒక కుటుంబసభ్యుల్లా ఉండాలి కాబట్టి మేమంతా మీ ఇంటికివస్తాం పదండి" అని కోరస్‌లా అన్నారు.

చందూవంశీ సంధ్యాల

### లావు

"యేవండీ మీరీ మధ్య మరీ చిక్కిపోతున్నారు దేనికండీ" అంది భార్య.

"నీవు లావు అయితే నేను చిక్కిపోక చస్తానా" విసుక్కుంటూ అన్నాడు భర్త.

చందూవంశీ సంధ్యాల



గారూ! మంచి మందులు, బాగా చదువుకున్న డాక్టర్లు ఉన్నారు మనదేశంలోనే. లేకపోతే విదేశాలకైనా పంపించవచ్చు ట్రీట్‌మెంట్‌కి. మీలాంటి వాళ్లకి డబ్బు గురించి వెతుక్కోవాల్సిన అవసరం కూడా ఉండదు."

సరళ ఊరడింపు మాటలు ఆవిడమీద పనిచేసినట్టే ఉన్నాయి. తేరుకుని జవాబు చెప్పింది.

"డబ్బు గురించి కాదు నా బాధ. పసివాడు, పట్టుమని పదహారేళ్లు లేవు వాడికి. వాడి గుండె చీల్చి ఆపరేషన్ చేస్తారంటే కన్నతల్లిని నాకు గుండెకోత కాదా?"

"గుండెజబ్బా! ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలా?"

లేత తమలపాకులా నాజూకుగా కనబడే రవికి? సరళ నిశ్చేష్టురాలైంది. రంగనాయకమ్మగారే సరళని మామూలు స్థితికి తీసుకురావాల్సి వచ్చింది.

"ఫరవాలేదమ్మా సరళా! ఈ రోజుల్లో డబ్బు పారేస్తే దొరకనిది లేదు. ఆపరేషన్ చిన్నదే అన్నారు. ఎంత కాస్ట్లీ అయినా నేను వెనుకాడననుకో! బొంబాయో, మెడ్రాసో తీసుకుని వెడతాం. డబ్బు విరజిమ్ముతాం. డాక్టర్లని కొనేస్తాం. అంతా సవ్యంగానే జరుగుతుంది. మావాడి ఆపరేషన్ సక్సెస్ అవుతుందని, అయ్యాక పదిలక్షలు హాస్పిటల్‌కి డొనేట్ చెయ్యమని బొంబాయిలో ఒకఆస్పత్రివాళ్లు అడిగారు కూడాను. కాని నా బాధల్లా వేరు. వాడికి సూది గుచ్చుకుంటే నాకొక రోజల్లా అన్నం సహించదు. అలాంటిది వాడి గుండెని డాక్టర్లు చకచకా చీల్చుతారంటే ఎలా సహించగలను?"

రంగనాయకమ్మగారి ఆక్రోశం, అప్పుడే అక్కడికి వచ్చి విన్న గీతకూడా ఎప్పటిలా ఆవిడని నిర్లక్ష్యం చేయలేకపోయింది. కాసేపు సరళ, గీత ఇద్దరూ కూడా ఈ రోజుల్లో ఓపెన్‌హార్ట్ సర్జరీ అంటే ఎంత తేలికగా చేస్తున్నారో, ఎన్నో కేసులు, ఉదాహరణలిచ్చారు. డ్రైవరు రాగానే ఆవిడ వెడుతూ వెడుతూ మళ్లీ బొంబాయినుంచి వచ్చాకే కలుస్తానని చెప్పింది. రవి త్వరగా ఆరోగ్యంగా తిరిగి రావాలని కోరుతున్నట్లు రంగనాయకమ్మగారితో చెప్పడమే కాదు, సరళా, గీతా మనస్ఫూర్తిగా దేవుణ్ణి ప్రార్థించారు కూడా.

★ ★ ★

రెండు నెలలుగా మహిళా మండలి ఖరీదైన కబుర్లు లేక చిన్నబోయిందనే చెప్పాలి. తీరికగా ముచ్చటలాడుకుంటున్న సరళా, గీతా కూడా అదే అనుకున్నారు.

"రెండు నెలలయినా ఇంకా రాలేదే వీళ్లు! రవికెలా ఉందో పాపం!" అంది సరళ.

"ఇన్నాళ్లూ అశ్రద్ధ చేసినందుకు అక్కడి డాక్టర్లు వీళ్లని బాగా మందలించారట. ముందు చాలా చిన్నదే అన్నారట. కాని ఇప్పుడు మేజర్ ఆపరేషన్ చెయ్యాలన్నారట. స్పెషలైజ్ చేసిన సర్జెన్ ఫారెన్‌నుండి రావడంకోసం ఎదురు చూస్తున్నారట. నిన్ననో, ఇవాళో వచ్చి ఉండాలి ఆయన" అంది గీత.

"పాపం!" అంది సరళ రవి కళ్లలో మెదులుతుండగా.

"కొడుకు జబ్బుకూడా చాలా కాస్ట్లీదే అని మురిసిపోతోందేమో ఆవిడ" గీత కంఠంలో కొంచెం వ్యంగ్యం ధ్వనించింది.

"మిగిలిన విషయాలటుంచు. కొడుకు విషయంలో కూడా అలా అనుకుంటుంది అనుకోకూడదు. ఆ రోజు చూడు. ఎలా బాధపడిందో! నువ్వెప్పుడూ ఆవిడని సరిగా అర్థం చేసుకోలేదు."

సరళ మాటలు పూర్తికాకుండానే ఆయాసపడుతూ, సుడిగాలిలా వచ్చింది మహిళా మండలి సెక్రటరీ సునీత. "ఈ విషయం విన్నారా?" అంటూ. ఆ తీరు చూస్తే ఏదో జరగరాని ఘోరమే జరిగినట్లు అనిపిస్తోంది. ఎవరూ కూడా 'ఏమిటి?' అని అడగలేదు. అడిగితే ఎలాంటి జవాబు వినాల్సివస్తుందోనని. సునీతే చెప్పింది.

"రవి పోయాట్ట!"

"ఆఁ!"

వింటున్న వాళ్లంతా నిశ్చేష్టులయ్యారు. ఒక్క నిమిషంలో మహిళా మండలిలో ఎక్కడెక్కడ ఉన్నవాళ్లు అక్కడికి చేరుకున్నారు.

"లక్షలు ఖర్చుపెట్టి ఆపరేషన్ చేశాక బాగానే ఉన్నాట్ట! ఫర్వాలేదు గండం గడిచిందని అందరూ అనుకున్నారట. తాను ఓపెన్ హార్ట్ సర్జరీ అయ్యాక కూడా బతికున్నాను అన్న ఆనందం అతనికి షాక్‌లాగా వచ్చి హార్ట్ ఫెయిల్ అయిందట. ఆపరేషన్ అయిన భాగం మాత్రం బాగానే ఉందట. ఆపరేషన్ సక్సెస్ బట్ 'పేషెంట్ ఎక్స్‌పైర్డ్.'" వింటున్న అందరికీ గుండెలు బరువెక్కాయి.

రంగనాయకమ్మగారంటే గౌరవం, సానుభూతి ఉన్న సరళ కూడా 'వాట్ ఎ కాస్ట్లీ లాస్' అను అనుకోకుండా ఉండలేకపోయింది.




**కళ్లు**

బస్‌స్టాండ్‌లో గాబరాగా పరిగెడ్తూ సుబ్బారావు కాలు తొక్కేశాడు పాపారావు. సుబ్బారావుకి చిర్రెత్తుకొచ్చింది.

"క్షమించండి!" అని ముందుకు వెళ్ళబోయాడు పాపారావు.

"ఆగవయ్యా ఆగు. కళ్ళు మూసుకుపోయి కాలు తొక్కిందికాక 'క్షమించండి' అని చెప్పి వెళ్ళిపోతే సరిపోతుందా... మర్యాదగా "సారీ చెప్పు" అన్నాడు సుబ్బారావు.

**పరీక్ష**

"ఈ రోజు పరీక్షలో అన్ని ప్రశ్నలకీ సమాధానం రాసేసావా?"

"అన్నింటికీ రాసాను కాని... ఆఖరి ప్రశ్నకి మాత్రం ఆన్సర్ రాయలేకపోయాను. అదొక్కటే పూర్తి చెయ్యలేకపోయాను".

"అదేం! టైం సరిపోలేదా?"

"టైం సరిపోక కాదు—ఆ వంశీ గాడు కాపీ కొట్టనివ్వలేదు సార్" చెప్పాడు శేఖర్.

